సాక్షి
రంగారెడ్డి
శనివారం । 17 । మే । 2025



భక్తిభావాన్ని..

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. 10లో▸





❖ ఎకో పార్క్‌లో ముద్దుగుమ్మలు

శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరులోని ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కులో శుక్రవారం సాయంత్రం మిస్ వరల్డ్ పోటీదారులు సందడి చేశారు. పార్క్ అందాలకు ఫిదా అయిపోయారు. అందాల భామలు ఆనందాల లోకంలో తేలియాడారు. ఆహ్లాదకర వాతావరణంలో ముద్దుగుమ్మలు తన్మయత్వం చెందారు. – శంకర్‌పల్లి

న్యూస్‌రీల్

పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరిస్తాం

కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం పెన్షన్ ఆదాలత్, జీపీఎఫ్ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 27 ప్రభుత్వ శాఖల్లో పని చేసిన 93 పెన్షన్ పెండింగ్ దరఖాస్తులు 39 మంది పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా సమస్యలు లేకుండా చూస్తామని చెప్పారు. దరఖాస్తులను అకౌంటెంట్ జనరల్ హైదరాబాద్ తెలంగాణ వారికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ ఎంఎస్ చందా పండిట్, అభయ్, సోనార్కర్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ పద్మావతి, జిల్లా రెవెన్యూఅధికారి సంగీత, డిప్యూటీ డైరెక్టర్ రాజు, సంబంధిత శాఖల అధికారులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఈ నెల 21 వరకు 'దోస్త్'

షాద్‌నగర్‌రూరల్: ఇంటర్మీడియెట్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ ద్వారా డిగ్రీలో చేరేందుకు ఈ నెల 21 వరకు గడువు ఉందని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ పీజీ అడ్మిషన్లకు దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 29న తొలి అడ్మిషన్ల కేటాయింపు జాబితా కళాశాలకు విడుదల అవుతుందని చెప్పారు. ఈ నెల 30 నుంచి జూన్ 6 వరకు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని వివరించారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 63050 51490, 98850 03390, 97034 41345 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనివాస్

ఆమనగల్లు: ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో భాగంగా బకాయిలు విడుదల చేయకపోవడంతో లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని టీఎస్ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బకాయి ఉన్న దాదాపు రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఓటీఎస్ కింద సెటిల్ చేసి విద్యాసంవత్సరం ప్రారంభంలోనే చెల్లిస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. వెంటనే బకాయిలు చెల్లించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. సమావేశంలో టీఎస్ఎస్‌ఓ నాయకులు వంశీ, సుదర్శన్, చిక్కి, సందీప్ తదితరులు ఉన్నారు.


ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో రూ.15.2 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: పెట్టుబడుల పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.15.2 లక్షలు స్వాహా చేశారు. వివరాలివీ.. నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి గత నెల 9న వాట్సాప్ కాల్ వచ్చింది. తమ సూచనలతో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతూ ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలు వస్తాయని నమ్మబలికారు. తమ కంపెనీ పేరు 'ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లిమిటెడ్' అని, తమకు సెబీ అనుమతి కూడా ఉందని నమ్మించారు. ఐసీఐసీఐ సెక్యూరిటీ ట్రేడింగ్ పేరుతో ఉన్న యాప్‌ను లింక్ ద్వారా షేర్ చేసిన సైబర్ నేరగాళ్లు దాన్ని ఇన్ స్టల్ చేసుకుని, యాక్టివేట్ చేసుకోవాలని సూచించారు. అలా చేసిన బాధితుడు దాని ద్వారానే నేరగాళ్ల ఖాతాల్లోకి రూ.2 లక్షలు, రూ.5 లక్షలు, రూ.8.2 లక్షల చొప్పున బదిలీ చేశారు. ఈ మొత్తాన్ని స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసినట్లు, లాభాలతో కలిపి బ్యాలెన్స్ రూ.91.21 లక్షలకు చేరినట్లు యాప్‌లో బాధితుడికి కనిపించింది. ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా సాధ్యం కాలేదు. నగదు వెనక్కు తీసుకోవాలంటే మరో రూ.4.3 లక్షలు డిపాజిట్ చేయాలంటూ నేరగాళ్లు చెప్పారు. అంత మొత్తం తన వద్ద లేదని బాధితుడు చెప్పగా.. విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం లేదంటూ నేరగాళ్లు స్పష్టం చేశారు. త్వరలోనే తమ యాప్‌లోని ఖాతా కూడా బ్లాక్ అయిపోతుందని బెదిరించారు. దీంతో తాను రూ.15.2 లక్షల మేర మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు శుక్రవారం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ అంతంతే..

గడువు పొడిగిస్తున్నా స్పందన నామమాత్రమే

- 25 శాతం రాయితీ ఇచ్చినా ప్రభావం కొంతే..
- క్రమబద్ధీకరణకు ఆసక్తి చూపని యజమానులు
- ఆశించిన ఆదాయం రూ.600 కోట్లకుపైగా
- ఇప్పటి వరకు సమకూరింది రూ.255 కోట్లే
- ఈ నెలాఖరు వరకు మరోసారి అవకాశం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అక్రమ లే అవుట్లను 25 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. మే చివరి వరకు గడువు పొడిగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఫీజు చెల్లించేందుకు ఎప్పటికప్పుడు గడువు పెంచుతూ వస్తున్నా.. ప్లాట్ల యజమానుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించడం లేదు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. మూడు కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 2,55,923 దరఖాస్తులు అందగా, వీటిలో 1,78,591 క్రమబద్ధీకరణకు అర్హత పొంది, అర్హులైన వారికి నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకు 65,186 మంది మాత్రమే తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.255.56 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. 77,332 దరఖాస్తులకు సంబంధించిన ప్లాట్లు నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో ఉన్నట్లు గుర్తించి, వాటిని రిజెక్ట్ చేశారు.

మూడుసార్లు గడువు పెంచినా..

ఖాళీ ప్లాట్లు/ లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం 2020లో నోటిఫికేషన్ జారీ చేసింది. లే అవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుకు రూ.పది వేలు, ఖాళీ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.వెయ్యి ఫీజుగా నిర్ణయించింది. ఆ మేరకు హెచ్‌ఎండీఏ పరిధిలోని నాలుగు జోన్లలో 3,58,464 దరఖాస్తులు రాగా, రంగారెడ్డిలోని మూడు కార్పొరేషన్లు, పదిహేను మున్సిపాలిటీల నుంచి రెండున్నర లక్షలకుపైగా, ఫరూఖ్‌నగర్, కేశంపేట, యాచారం, తలకొండపల్లి, కడ్తాల్, కొందుర్గు, మాడ్గుల, మంచాల, జిల్లెడు చౌదరిగూడెం మండల కేంద్రాల నుంచి 45 వేలకుపైగా దరఖాస్తులు అందాయి. నిజానికి మూడేళ్ల క్రితమే ఈ దరఖాస్తులను స్వీకరించినప్పటికీ వివిధ కారణాలతో క్రమబద్ధీకరణ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫిబ్రవరిలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని (ఓఎస్ఎస్) తీసుకొచ్చి 25 శాతం రాయితీ ప్రకటించింది. మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం వాటి పరిశీలన కోసం రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఆయా బృందాలు ఇప్పటికే ఆయా దరఖాస్తులను పరిశీలించాయి. తొలి గడువు మార్చి 31తో ముగిసింది. తర్వాత క్రమబద్ధీకరణ గడువును ఏప్రిల్ 30 వరకు పెంచింది. ఈ గడువు కూడా ముగిసిపోవడంతో మరో మూడు రోజులు అవకాశం కల్పించింది. అయినా ఆశించిన స్థాయిలో ఫీజు చెల్లింపులు కాకపోవడంతో తిరిగి నాలుగోసారి గడువును మే 31 వరకు పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

ఫీజు చెల్లించక పోవడానికి కారణాలివే..

- ఖాళీ ప్లాట్లకు రూ.లక్షల్లో ఫీజులు ఎందుకు చెల్లించాలనే భావన యజమానుల్లో ఉంది. గృహాలు నిర్మించే సమయంలో చెల్లిస్తే వడ్డీ కలిసి వస్తుందని భావిస్తున్నారు.
- గతంలో భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎల్‌ఆర్‌ఎస్‌కు అనుమతిస్తే.. సదరు స్థలం మార్కెట్ విలువను బట్టి దరఖాస్తుదారు ఫీజు చెల్లించేవారు. ప్రస్తుతం క్షేత్రస్థాయి పరిశీలనకు ముందే ఫీజు చెల్లించాలని ప్రభుత్వం ప్రకటించడంతో ఇందుకు వారు వెనుకాడుతున్నారు.
- 25 శాతం రాయితీ వర్తించాలంటే మొత్తం సొమ్ము ఒకే సమయంలో చెల్లించాల్సి వస్తోంది. వాయిదా పద్ధతిలో చెల్లించే అవకాశం లేకపోవడం ఇబ్బందిగా మారింది.
- ఫీజు చెల్లించేందుకు ఆసక్తి చూపుతున్న వారి ప్లాట్లు 111 జీఓ పరిధిలో ఉండటం, అసైన్డ్, భూదాన్, వక్ఫ్, దేవాదాయశాఖ, ప్రభుత్వ భూముల జాబితాలో నమోదై ఉండటంతో ఆ దరఖాస్తులు క్రమబద్ధీకరణకు నోచుకోలేకపోతున్నాయి.

హోర్డింగ్‌లపై హైడ్రా నజర్

- మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- గుర్తించే పనిలో అధికారులు
- తొలగింపు ప్రక్రియ షురూ

మీర్‌పేట: శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కొన్నేళ్లుగా ఎలాంటి అనుమతులు పొందకుండా ఏర్పాటు చేస్తున్న వాణిజ్య ప్రకటనలకు సంబంధించిన హోర్డింగ్‌లపై హైడ్రా దృష్టి సారించింది. మీర్‌పేటతో పాటు చాలా వరకు మున్సిపాలిటీల్లో ఎలాంటి అనుమతులు పొందకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అడిగేవారు లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసినా స్థానిక టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసే సంస్థలు, భవనాల యజమానులకు కొంత కాలంగా లబ్ధి చేకూరుతోంది. ఈ క్రమంలో స్థానిక మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగంతో కలిసి హైడ్రా అక్రమ హోర్డింగ్‌లను గుర్తించి తొలగించే ప్రక్రియను ప్రారంభించింది.

యుద్ధ ప్రాతిపదికన తొలగింపు

మీర్‌పేట కార్పొరేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలో రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఏ ఒక్క హోర్డింగ్‌కు అనుమతి లేకపోవడం గమనార్హం. అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఈ ప్రాంతంలో ప్రముఖ సంస్థల వ్యాపార ప్రకటనలకు సంబంధించిన హోర్డింగ్‌లు ఉన్నాయి. కార్పొరేషన్‌లో సగం కంటే ఎక్కువ హోర్డింగ్‌లకు అనుమతులు లేవని హైడ్రా అధికారులు గుర్తించారు. మున్సిపాలిటీల్లో ప్రభుత్వ అనుమతులు పొందకుండా ఏర్పాటు చేసుకున్న హోర్డింగ్‌లను యుద్ధ ప్రాతిపదికన తొలగించనున్నట్లు తెలిపారు. మీర్‌పేట ప్రాంతంలో హోర్డింగ్‌లతో పాటు బస్ షెల్టర్ల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన పలు విద్యాసంస్థలు, ఇతర సంస్థల ఫ్లెక్సీలను సైతం తొలగిస్తున్నట్లు చెప్పారు.



బాలాపూర్ చౌరస్తాలో అక్రమ హోర్డింగ్‌ను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

మరోవైపు కొత్తవి ఏర్పాటు

ఓవైపు హైడ్రా అధికారులు అనుమతులు లేని హోర్డింగ్‌లపై కొరడా ఝులిపిస్తుండగా, మరోవైపు అవేమీ పట్టించుకోకుండా కొత్తవి ఏర్పాటు చేస్తుండడం గమనార్హం. మున్సిపల్ కార్యాలయం వద్ద మీర్‌పేట కూడలిలో ఎలాంటి అనుమతులు పొందకుండా తాజాగా భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. అక్రమ హోర్డింగ్‌లపై హైడ్రా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కూడలిలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఆయువు తీసిన ఆట వస్తువు

- ఓపెన్ జిమ్‌లోని ఎయిర్‌స్వింగ్ పరికరం పడి చిన్నారి మృతి
- మీర్‌పేట్‌లోని చిల్డ్రన్స్ పార్కులో ఘటన



నిఖిల్ (ఫైల్)

మీర్‌పేట: ఓపెన్‌జిమ్ పరికరం తలపై పడటంతో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన మీర్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జిల్లెలగూడలోని దాసరి నారాయణ కాలనీకి చెందిన ప్రసాద్ కుమారుడు నిఖిల్ (5) గురువారం సాయంత్రం స్థానికంగా ఉండే పిల్లలతో కలిసి రోజూ మాదిరిగానే ఆడుకునేందుకు పక్కనే ఉన్న చిల్డ్రన్స్ పార్కుకు వెళ్లాడు. ఓపెన్ జిమ్‌లోకి వెళ్లి ఎయిర్ స్వింగ్ పరికరంపైకి ఎక్కాడు. దీనికి సంబంధించిన ఇనుపకడ్డీ తలపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన ఓపెన్ జిమ్‌లోని ఎయిర్‌స్వింగ్ పరికరం

అధికారుల నిర్లక్ష్యంతోనే..

ఓపెన్ జిమ్‌లోని ఎయిర్ స్వింగ్ పరికరం పాడైపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయించలేదు. పాడైన పరికరం పక్కన పడేసి ఉండగా, గుర్తు తెలియని వ్యక్తులు దీన్ని యథా స్థితిలో పెట్టారు. ఇది తెలియని చిన్నారి ఎయిర్ స్వింగ్‌పైకి ఎక్కడంతో ఇనుప బొంగు నిఖిల్ తలపై పడింది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని వాకర్స్, స్థానిక కాలనీలవాసులు మండిపడ్డారు.

❖ హ్యాపీ బర్త్ డే



చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య జన్మదినం సందర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యేకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

'అందాల' డ్రెస్ డిజైనర్ మన స్వాతి..



స్వాతి డిజైన్ చేసిన డ్రెస్‌లలో అందాలభామలు



స్వాతి

అనంతగిరి: ప్రపంచ అందాల పోటీల్లో భాగంగా గురువారం భూదాన్ పోచంపల్లిలో తళుక్కుమన్న ముద్దుగుమ్మలకు డ్రెస్‌లు డిజైన్ చేసింది ఎవరో కాదు వికారాబాద్ జిల్లాకు చెందిన మఠం వైద్యనాథ్ కూతురు ఎం.స్వాతి. ఈమె ఆరేళ్లుగా హైదరాబాద్‌లో మైరీతి, తరం పేరిట డ్రెస్ డిజైనింగ్ చేస్తోంది. విదేశీ వనితలు, నటీమణులు, ఉన్నత స్థాయిలో ఉన్న వారికి వివిధ ఆకృతుల్లో అందమైన డ్రెస్‌లు డిజైన్ చేసి ఇస్తోంది. ఈ క్రమంలో మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న 40 మంది అందెగత్తెలకు వారు కోరిన విధంగా డ్రెస్‌లను రూపొందించింది. పోచంపల్లి, నారాయణపేట చేనేత వస్త్రాన్ని వాడి దుస్తులు తయారు చేయడం వీరి ప్రత్యేకత. గురువారం జరిగిన కార్యక్రమంలో అందాల భామలు స్వాతి డిజైన్ చేసిన డ్రెస్‌లు ధరించి అలరించారు. దుస్తుల తయారీకి నెల రోజులు కష్టపడినట్లు తెలిసింది. స్వాతితోపాటు మైరీతి, తరం మరో వ్యవస్థాపకులు, మితుల్ నిర్వాహకులు ఎం.మహేంద్ర, ఎం.మానస, వారి డిజైనర్స్ మౌనిక, రమ్య ఇతర సిబ్బంది ఎంతో కష్టపడ్డారు.

మీటర్ దొంగల గుట్టు.. రీడింగ్ మిషన్‌తో రట్టు

- అక్రమ మీటర్ల జారీపై మరింత లోతుగా విచారణ
- ఇప్పటికే ఏఈ సహా లైన్ ఇన్‌స్పెక్టర్, ఆర్టిజన్‌పై వేటు
- తాజాగా మరికొంత మంది ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మీటర్ దొంగల గుట్టు రీడింగ్ మిషన్‌తో రట్టయింది. విద్యుత్ బిల్లుల జారీ కోసం వినియోగించిన మీటర్ రీడింగ్ మిషన్‌లోని జీపీఎస్ సాంకేతిక పరిజ్ఞానం ఇబ్రహీంబాగ్ డివిజన్‌లో మిస్సైన 42 విద్యుత్ మీటర్ల గుట్టును రట్టు చేసింది. ప్రత్యక్ష ప్రమేయం ఉన్న వారితో పాటు పరోక్షంగా ఇందుకు సహకరించిన వారిని పట్టించింది. సైబర్‌సిటీ సర్కిల్ ఇబ్రహీంబాగ్ డివిజన్ (గండిపేట రెవెన్యూ సర్వే నంబర్ 246/1) చిత్రపురి కాలనీలోని పలు నిర్మాణాలకు తెలుగు సినీ వర్కర్స్ కో ఆపరేటివ్ సొసైటీ పేరున జనవరి 25న 42 విద్యుత్ మీటర్లు జారీ అయ్యాయి. డిస్కం జారీ చేసిన ఈ మీటర్లను దరఖాస్తుదారుని ఇంట్లో పెట్టకుండా ఇక్కడ విద్యుత్ పనులు దక్కించుకున్న ప్రైవేటు కాంట్రాక్టర్ చెన్నకేశవరెడ్డి తన ఇంట్లో నిల్వ చేసుకున్నారు. నిజానికి డిస్కం మంజూరు చేసిన మీటర్లకు ఆ మరుసటి నెల నుంచే విద్యుత్ రీడింగ్, బిల్లుల జారీ ప్రక్రియను చేపట్టాలి. కానీ అలా చేయలేదు. ఈ విషయం తెలిసీ ఏఈ సహా లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు పట్టించుకోలేదు. అంతే కాదు ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఏ ఒక్క మీటర్‌కు కూడా రీడింగ్ నమోదు చేయలేదు. ఏప్రిల్‌లో డిస్కం సిబ్బంది కాంట్రాక్టర్ ఇంటికి చేరుకుని కనెక్షన్ కూడా ఇవ్వని ఖాళీ మీటర్లకు మినిమం బిల్లులు జారీ చేశారు. జనవరిలో జారీ చేసిన మీటర్లకు ఏప్రిల్‌లో రీడింగ్ నమోదు చేయడంపై ఏడీఈ అంబేడ్కర్‌కు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రీడింగ్ మిషన్‌లో అమర్చిన జీపీఎస్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కొల్లగొట్టిన మీటర్లను గుర్తించారు. అంతేకాదు కేటగిరీ–2 కింద జారీ చేయాల్సిన మీటర్లను కేటగిరీ–1 కింద జారీ చేసినట్లు తేలింది. అక్రమ వసూళ్లు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈ భాస్కర్‌రావు సహా లైన్ ఇన్‌స్పెక్టర్, ఆర్టిజన్‌పై ఇప్పటికే వేటు పడింది. ఇదే అంశంపై సీఎండీ సమగ్ర విచారణకు ఆదేశించగా, ప్రస్తుతం సెక్షన్ల వారీగా ఇప్పటి వరకు జారీ చేసిన విద్యుత్ మీటర్లు, వసూలు చేస్తున్న నెలవారీ బిల్లుల వివరాలపై ఆరా తీస్తున్నారు. సెక్షన్ పరిధిలో ఇప్పటి వరకు 225 మీటర్లు జారీ చేయగా, వీటిలో ఇప్పటికే భారీగా విద్యుత్ రీడింగ్ నమోదైన పలు మీటర్లు కన్పించకుండా పోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కన్పించకుండా పోయిన ఆయా మీటర్లను గుర్తించే పనిలో అధికారులు ఉన్నట్లు సమాచారం. ఇది బయటికి వస్తే మరింత మంది అధికారులు ఈ కేసులో ఇరుక్కునే అవకాశం లేకపోలేదు.

ఔత్సాహిక ఆలోచన పెరగాలి

ఉన్నత విద్యామండలి
చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి


అంతర్జాతీయ సదస్సులో
సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

మొయినాబాద్: భారత దేశ యువతలో ఔత్సాహిక ఆలోచన ధోరణిని పెంపొందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో 'సుస్థిర ప్రపంచం కోసం ఔత్సాహిక, ఆవిష్కరణలు' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత సుస్థిర అభివృద్ధిపై ఆసక్తి పెంచుకుని.. ఆ దిశగా ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచడం కోసం మేనేజ్‌మెంట్ విద్యలో ఆ అంశాన్ని చేర్చాలని సూచించారు. యూఎస్ఏ స్కైలైన్ యునివర్సిటీ ప్రతినిధి శ్రీమహేష్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. పర్యావరణ అనుకూల పరిశ్రమల ఏర్పాటు వైపు యువత అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ రచనల సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ డీన్ రాములు, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి


ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్: ప్రతి ఒక్కరూ భక్తిభవాన్ని అలవర్చుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో శ్రీ సీతారాముల, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమంతుని విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


హంసమ్మ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన హంసమ్మ(29) అనే మతిస్థిమితం లేని మహిళ ఈ నెల 12 నుంచి కనిపించడం లేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పీఎస్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే 87126 62383 నంబర్‌కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

రాజీవ్ యువ వికాసం రుణాలు ఇవ్వాలి

తాండూరు టౌన్: రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణాల మంజూరులో బ్యాంకుల జోక్యం లేకుండా చూసుకోవాలని, రాజకీయ నాయకుల ప్రమేయం కూడా లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న ప్రతి నిరుద్యోగికి రుణం ఇవ్వాలన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క నిరుద్యోగికి అన్యాయం జరిగినా ఆందోళనలు తప్పవన్నారు.

రోడ్డును ఆక్రమించి.. షెడ్డు నిర్మించి

- ఉమ్మడి ఏపీలో చంద్రబాబు హయాంలో సిబ్బందికి క్వార్టర్లు
- వాటిలో తిష్టవేసిన అక్రమార్కులు రెవెన్యూ అధికారుల పరిశీలన
- అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశం


నిర్మాణాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్, షేక్‌పేట మండలం, జూబ్లీహిల్స్ రోడ్ నెం.78 నవ నిర్మాణ్‌నగర్ కాలనీ వెనక ఉన్న ప్రభుత్వ స్థలంలో..ఉమ్మడి ఏపీలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంట్లో పని చేసే సిబ్బంది కోసం క్వార్టర్లు నిర్మించారు. సర్వే నెం.403లో ఒక్కొక్కరికి 50 గజాల చొప్పున ఈ క్వార్టర్స్ నిర్మాణం చేపట్టారు. 1999 ప్రాంతంలో చంద్రబాబు ఇంట్లో పని చేసే సిబ్బంది కోసం ప్రభుత్వ ఖర్చులతో ప్రభుత్వ స్థలంలోనే ఈ క్వార్టర్లు నిర్మించి ఇందులో ఆరుగురికి పట్టాలు కూడా ఇచ్చారు. మరో ఆరు ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. అయితే చంద్రబాబు ఇంట్లో దోభీ, తోటమాలి తదితరులు ఖాళీగా ఉన్న ప్లాట్లలో ఉంటున్నారు. ప్లాట్ నెంబర్.1లో ఎలాంటి పట్టా లేకుండా సీహెచ్.మూర్తి అనే దోభీ కొంత కాలంగా అక్రమంగా నివసిస్తుండటమే కాకుండా..క్వార్టర్స్ ముందు రోడ్డును ఆక్రమించి షెడ్డు నిర్మించాడు. దీంతో స్థానికులు రాకపోకలు స్తంభించాయి. ఈ విషయమై కొంత కాలంగా పట్టాలు ఉండి అధికారికంగా ఉంటున్న వారికి, పట్టాలు లేకుండా ఖాళీ ప్లాట్లలో ఉంటున్న వారికి మధ్య రోడ్డు గొడవలు జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఇక్కడ సీవరేజి పైప్‌లైన్, మంచినీటి పైప్‌లైన్ మంజూరు కావడంతో పాటు జీహెచ్ఎంసీ రోడ్డు పనులు కూడా ప్రారంభించాల్సి ఉంది. అయితే దోభీ మూర్తి ఆక్రమించిన స్థలంలో షెడ్డు నిర్మాణం వీటికి అడ్డుగా ఉంది. సదరు షెడ్డును తొలగిస్తే పనులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణంపై స్థానికులు షేక్‌పేట తహసీల్దార్‌కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ అనితారెడ్డి క్వార్టర్లను పరిశీలించారు. వారి వద్ద ఉన్న పట్టాలు, ఖాళీగా ఉన్న ప్లాట్లపై ఆరా తీశారు. రోడ్డు ఆక్రమించి షెడ్డు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కూలివేస్తామని, అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు రెండు రోజుల గడువు ఇస్తున్నామని ఆమె హెచ్చరించారు. మరో వైపు పట్టాలు లేకుండానే కొంత మంది అక్రమార్కులు ప్రభుత్వం నిర్మించిన ఈ క్వార్టర్లలో తిష్టవేసి వీటిని శాశ్వతంగా కాజేసేందుకు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు ఈ విషయంపై స్పందించి అక్రమార్కులను ఖాళీ చేయించి క్వార్టర్స్ అన్యాక్రాంతం కాకుండా చూడటంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ట్యాంక్‌బండ్‌పై ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ట్యాంక్‌బండ్‌పై శనివారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి చిల్డ్రన్స్ పార్క్ వరకు ర్యాలీ జరుగనున్న నేపథ్యంలో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ సమయంలో ట్యాంక్‌బండ్ పైకి వాహనాలు అనుమతించకుండా అంబేడ్కర్ విగ్రహం, డీబీఆర్ మిల్స్, సెయిలింగ్ క్లబ్ కేంద్రంగా ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు

వర్సిటీ శాస్త్రవేత్తలు మాధవి, లీలారాణి


రైతులకు అవగాహన కల్పిస్తున్న
వ్యవసాయ శాస్త్రవేత్తలు

మొయినాబాద్: సేంద్రియ వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు కలుగుతాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఏ.మాధవి, పి.లీలారాణి అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో పంటల సాగు, భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులతోపాటు నేల ఆరోగ్యాన్ని, భూసారాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. భూసార పరీక్షలు చేయించి నేల స్వభావాన్ని బట్టి తగిన మోతాదులో జీవన ఎరువులు వాడాలని సూచించారు. పంటల సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ అనురాధ, పీహెచ్‌డీ విద్యార్థులు రాజ్‌కుమార్, నవ్య, అశోక్, ఏఈఓ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


జలమండలి జీఎంకు వినతిపత్రం
అందజేస్తున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని సాయినాథ్ కాలనీవాసులు శుక్రవారం జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన జీఎం.. రూ.4 కోట్ల నిధులు కేటాయించామని, టెండర్ల ప్రక్రియ అనంతరం తాగునీటి పైపులైన్ పనులు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాగేందర్, మల్లారెడ్డి, పరమేష్, సాంబయ్య పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

మొయినాబాద్: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనికేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షభానా బేగం(20) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. గురువారం రాత్రి తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోనే బెడ్‌రూంలోకి వెళ్లి డోర్ పెట్టుకుంది. ఎంతకీ డోర్ తీయకపోవడంతో కుటుంబ సభ్యులు కిటికీ నుంచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి ఆమెను చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

గంజాయి చాక్లెట్ల పట్టివేత

ఇద్దరు వ్యక్తుల రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: గుట్టుచప్పుడు కాకుండా కిరాణం దుకాణంలోకి గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న ముఠాను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన షర్వాన్ కుమార్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడలో పాన్‌షాప్ నిర్వహించే వాడు. నాలుగు నెలలుగా రాజస్తాన్ నుంచి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి వాటిని కూలీలకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన అజిత్ సర్దార్‌తో పరిచయడం ఏర్పడింది. ఇద్దరు కలిసి గంజాయి చాక్లెట్ల వ్యాపారం చేద్దామని నిర్ణయానికి వచ్చారు. షర్వాన్ కుమార్ రాజస్తాన్ నుంచి గంజాయి చాక్లెట్లు తీసుకొని వచ్చి మరో వ్యక్తి బినోద్ సర్ధార్‌కు ఇస్తే.. అతను చుట్టు పక్కల ఉండే లేబర్‌కు అమ్మాలని పథకం రచించారు. తమ ఒప్పందం ప్రకారం బుధవారం సాయంత్రం ఐదు డబ్బాలలో 810 గ్రాముల గంజాయి చాక్లెట్లను షర్వాన్ కుమార్ రాజస్తాన్ నుంచి తీసుకొచ్చి నాదర్‌గుల్ ఇండస్ట్రీయల్ ఏరియాలో టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ వద్ద బినోద్ సర్దార్‌కు ఇస్తుండగా ఆదిబట్ల పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శుక్రవారం వెల్లడించారు.

ప్రేమ వ్యవహారంలో మనస్తాపం

ఉరేసుకుని యువకుడి మృతి

చేవెళ్ల: ప్రేమ వ్యవహారంలో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కంసాన్‌పల్లికి చెందిన కుమ్మరి రవి(22) నార్సింగి పరిధిలో ఆటో నడిపేవాడు. ఇతనికి ఓ అమ్మాయితో ప్రేమ వ్యవహారం ఉన్నట్లు సమాచారం. ఇదే విషయమై ఇరువురి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో విరక్తి చెందిన రవి శుక్రవారం ఉదయం తన ఆటోలో చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల అటవీ ప్రాంతానికి వచ్చి చెట్టుకు ఉరేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆటో నంబర్ ఆధారంగా వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి బాబమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బాకీ వసూలుకు వెళ్తే కుక్కతో కరిపించాడు

వెంగళరావునగర్: బాకీ వసూలు కోసం వెళ్లిన బ్యాంకు ఏజెంట్‌పై దాడి చేయడమేగాక కుక్కతో కరిపించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్‌కు చెందిన నందివర్ధన్‌రావు ఆర్‌బీఎల్ బ్యాంకు క్రెడిట్ కార్డు వినియోగించుకుని డబ్బులు తిరిగి చెల్లించలేదు. దీంతో బ్యాంకు ఉత్తర్వుల మేరకు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ కె.సత్యనారాయణ గురువారం సాయంత్రం జవహర్‌నగర్‌లోని అతడి ఇంటికి వెళ్లాడు. బంధువులు ఆయన ఇంట్లో లేడని చెప్పడంతో సత్యనారాయణ వెనుదిరిగాడు. మొదటి అంతస్తు నుంచి కిందకు వస్తుండగా ఎదురుగా వచ్చిన నందివర్ధన్‌రావు ఎవరు నీవు, ఎక్కడ నుంచి వస్తున్నావని వివరాలు అడిగాడు. తాను బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌నని చెప్పడంతో ఆయన ఒక్కసారిగా సత్యనారాయణపై దాడిచేశాడు. తీవ్రంగా కొట్టడమే కాకుండా ఫోన్‌ను విసిరి పగల కొట్టాడు. అంతేగాకుండా పెంపుడు కుక్కను అతనిపై ఉసి గొలిపి కరిపించాడు. గాయపడిన సత్యనారాయణ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న అనంతరం శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీలో సస్పెండైన ఉద్యోగుల విషయంలో త్వరలో నిర్ణయం

లక్డీకాపూల్: తొలగించబడిన ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి త్వరలోనే సముచిత నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి విధుల నుంచి తొలగించిన ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రజాభవన్ వద్ద బైఠాయించిన ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను చిన్నారెడ్డి అడిగి తెలుసుకున్నారు. తగిన నిర్ణయం త్వరలోనే తీసుకుంటామని ఆర్టీసీ ఉద్యోగులకు భరోసా కల్పించారు. కాగా ఈ కార్యక్రమంలో మొత్తం 226 దరఖాస్తులు అందాయి.

ట్రాఫిక్ చలాన్ల సమస్య నివారించాలి

- సీఎం ప్రజావాణిలో బిషప్‌లు, పాస్టర్ల వినతి
- డీజీపీకి లేఖ రాసిన ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి


వినతి పత్రం అందజేస్తున్న
క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు

లక్డీకాపూల్ : గ్రేటర్ పరిధిలోని చర్చిల వద్ద ట్రాఫిక్ చలాన్ల సమస్యను నివారించాలంటూ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జీ. చిన్నారెడ్డి పోలీసులను కోరారు. ఈ మేరకు ఆయన డీజీపీకి లేఖ రాశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చర్చిల వద్ద ప్రతి ఆదివారం ప్రార్థనలకు వచ్చే క్రిస్టియన్లు రోడ్డు పక్కన వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ పోలీసులు చలాన్లు రాస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బిషప్స్, పాస్టర్స్, క్రిస్టియన్ సంఘం ప్రతినిధులు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన చిన్నారెడ్డి చర్చిల వద్ద చలాన్ల సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. క్రిస్టియన్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనే సాల్మన్ రాజ్ నేతృత్వంలో ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరరయ్యారు.

నిమ్స్‌లో స్లిట్ ల్యాంప్ ఏర్పాటు


స్లిట్ ల్యాంప్‌ను ప్రారంభిస్తున్న
నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: నిమ్స్‌లో రుమటాలజీ సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల కంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక స్లిట్ ల్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో సమకూర్చిన ఈ స్లిట్ ల్యాంప్‌ను శుక్రవారం డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుమటాలజీ క్లినిక్‌లో ప్రతి మంగళవారం పిల్లలకు స్లిట్ ల్యాంప్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రుమటాలజీ రోగుల కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ రూ. 4 లక్షల విలువైన ఆధునిక స్లిట్ ల్యాంప్‌ను సమకూర్చిందన్నారు. క్లినికల్ ఇమ్యునాలజీ, రుమటాలజీ విభాగంలో ఆధ్వర్యంలో అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో రుమటాలజీ విభాగం హెచ్ఓడీ డా.లీజా రాజశేఖర్, ఎల్వీ ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.ప్రసాంత్ గర్గ్, యూవైటిస్ నిపుణులు డా. బసు, పీడియాట్రిక్ రుమటాలజీ నిపుణుల డా.కీర్తి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌ను వేధించిన బీటెక్ విద్యార్థి అరెస్ట్

ఘట్‌కేసర్: ఓ బాలికను బ్లాక్ మెయిల్ చేస్తూ వేధిస్తున్న బీటెక్ విద్యార్థిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అవుషాపూర్ గ్రామానికి చెందిన అవినాశ్‌రెడ్డి స్థానిక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇంజినీరింగ్ చదువుతున్న బాలికతో అతడికి ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. కొన్నాళ్ల క్రితం అతను సదరు బాలికకు ఫోన్ చేసి డబ్బు అవసరముందని ఇంట్లోని బంగారు ఆభరణాలు తీసుకురావాలని చెప్పాడు. లేని పక్షంలో తనతో దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో సదరు బాలిక బంగారు ఆభరణాలు తెచ్చి ఇచ్చింది. ఇంట్లో ఆభరణాలు కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను నిలదీయగా బ్లాక్ మెయిల్ విషయం చెప్పింది. దీంతో బాలిక తండ్రి ఈనెల 12న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం అతడిని రిమాండ్‌కు తరలించారు. కాగా ప్రియురాలి చెల్లిని తన దగ్గరికి సుకురావాలని అవినాశ్‌రెడ్డి బెదిరించినట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మనస్తాపానికి లోనైన ఆమె చెల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. సదరు యువకుడు బంగారాన్ని కుదువబెట్టి తీసుకున్న డబ్బులో నుంచి కొంత సదరు బాలిక కూడా తీసుకున్నట్లు సమాచారం.

రక్షణ రంగంలో స్వదేశీకరణకు కృషి

సంతోష్‌నగర్: రక్షణ రంగంలో ప్రభుత్వ దార్శనికత "మేక్ ఇన్ ఇండియా", "ఆత్మనిర్భర్ భారత్"కు అనుగుణంగా రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని కంచన్‌బాగ్‌లోని కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన మిశ్రు ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) ప్రాంగణంలో శుక్రవారం రక్షణలో స్వదేశీకరణను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ సమావేశాన్ని-2025 నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన మిధాని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.ఎస్.నారాయణ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కీలకమైన లోహాల స్వదేశీకరణలో ఎంఎస్ఎంఈల పాత్రను వివరించారు. వీటిలో చాలా వరకు ప్రస్తుతం భారతదేశ వ్యూహాత్మక, రక్షణ ప్రాజెక్టుల కోసం దిగుమతి చేసుకుంటున్నారన్నారు. రక్షణ సామగ్రి రంగంలో స్వావలంబన, స్థిరత్వాన్ని నిర్ధారించడానికి దేశీయ సామర్థ్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. మిధాని డైరెక్టర్ (ప్రొడక్షన్, మార్కెటింగ్) టి.ముత్తు కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా, రక్షణలో ఆత్మనిర్భరత కార్యక్రమాలకు మిధాని మద్దతును అందిస్తుందన్నారు. వ్యూహాత్మక పదార్థాలు, తయారీలో ఆవిష్కరణ, సామర్థ్య అభివృద్ధిని పెంపొందించడానికి ఎంఎస్ఎంఈలతో నిరంతర సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో మిధాని జీఎం (ఫైనాన్స్) కె.మధుబాల, ఏజీఎం (ఐ/సీ కొనుగోలు) శుభదీప్ ఘోష్ పాల్గొన్నారు.